బలగం BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 07 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## 8న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ సమావేశం



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశం కానున్నారు. ఈ సమావేశం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో జరగనుంది. ఈ విషయాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు.

# హోంగార్డులకు రోజుకు వెయ్యి వేతనం



- డ్రగ్స్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు..
- తీవ్రవాదుల దాడిలో ఐపీఎస్‌లు మరణిస్తే రూ.2 కోట్లు పరిహారం
- ట్రాఫిక్ నియంత్రణలో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యం
- వారికి డబుల్‌బెడ్‌రూం ఇండ్లు కేటాయింపు
- హోంశాఖ ప్రజాపాలన విజయోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఎస్డీఆర్ఎఫ్ నూతన లోగో ఆవిష్కరణ ఆకట్టుకున్న వాయుసేన విన్యాసాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో 14 వేల మంది హోంగార్డులు ఉన్నారని, వారికి రోజుకు రూ.వెయ్యి వేతనం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వీక్లీ పరేడ్ అలవెన్స్ రూ.200 చేస్తామని తెలిపారు. ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఇవాళ ఎస్డీఆర్ఎఫ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని రాష్ట్ర విపత్తు నిర్వహణ దళాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ మేరకు అంతముందు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్టీఆర్ మార్గ్ వద్ద జెండా ఊపి ఎస్డీఆర్ఎఫ్ వాహనాలు, బోట్లను ప్రారంభించారు. అనంతరం హెచ్ఎండీఏ మైదానంలో ఏర్పాటు చేసిన ఎస్డీఆర్ఎఫ్ స్టాల్?ను సందర్శించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలోని ఎస్డీఆర్ఎఫ్ లోగోను ఆవిష్కరించి ప్రజలను ఉద్దేశిస్తూ మాట్లాడారు. తెలంగాణకు రావాలంటే డ్రగ్స్ రవాణాదారులు భయపడాలని అన్నారు. డ్రగ్స్ విషవలయం గురించి పాఠశాలలు, కళాశాలల్లో చెప్పాలని సూచించారు. ప్రత్యేక శిక్షణ తీసుకున్న వారితో విద్యార్థులకు పాఠాలు చెప్పాలని తెలిపారు. పిల్లల భవిష్యత్తు గురించి పాఠశాల యాజమాన్యాలకు బాధ్యత ఉండాలని పేర్కొన్నారు. హోంగార్డుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇస్తామని చెప్పారు. హోంగార్డులకు మెరుగైన వైద్యసాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పోలీసుల పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందిస్తామని, ఇప్పటికే యంగ్ఇండియా పోలీసు స్కూలుకు 50 ఎకరాలు కేటాయించామని గుర్తుచేశారు. హోంగార్డు నుంచి డీజీపీ వరకు ఏ అధికారి పిల్లలైనా ప్రవేశం పొందవచ్చని తెలిపారు.

రాష్ట్రంలో మొత్తం 94 వేలమంది పోలీసులు ఉన్నారని, ఎక్కడ తీవ్రవాద కార్యకలాపాలు జరిగినా మనవాళ్ల(పోలీసులు) సాయం తీసుకుంటున్నారని తెలిపారు. పోలీసు ఉద్యోగం అనేది భావోద్వేగం, ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచే బాధ్యత అని వ్యాఖ్యానించారు. బాధితుల పట్ల పోలీసులు మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే నేరగాళ్లు, కబ్జారాయుళ్లకు అండగా ఉండటం కాదని హితవు పలికారు. కొందరు పోలీసుల తీరు వల్ల అందరికీ చెడ్డపేరు తెస్తోందని పేర్కొన్నారు. పేదలు, సామాన్యులు, బాధితులకు పోలీసులు అండగా ఉండాలని స్పష్టం చేశారు. మరోవైపు రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం రెండు వేల మంది సిబ్బందితో ఏర్పాటైంది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్డీఆర్ఎఫ్‌కు రూ.35.03 కోట్లు మంజూరూ చేసింది. విపత్తు సమయంలో బాధితుల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎస్డీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేసింది.

విద్యాసంస్థల యాజమాన్యాలతో కమిషనర్లు సదస్సులు నిర్వహించాలని సీఎం రేవంత్ ఆదేశించారు. డ్రగ్స్, గంజాయి కేసులు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి 6 నెలల్లోగా తీర్పులు వచ్చేలా చూస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లో చెరువులు, నాలాలు రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యలను మానవీయ కోణంలో చూస్తామని, వారిని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమిస్తున్నామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పారు. విధినిర్వహణలో మరణించిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



### 2 వేల మంది సిబ్బందితో ఎస్డీఆర్ఎఫ్

రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాన్ని (ఎస్డిఆర్ఎఫ్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ క్రమంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో సుమారు రెండు వేల మంది సిబ్బందితో ఎస్డీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేశారు. కాగా, ఎస్డీఆర్ఎఫ్ ఏర్పాటు, ఆధునికీకరణ కోసం రూ.35.03 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళానికి చెందిన బోట్లను కూడా సీఎం ప్రారంభించారు. అదేవిధంగా ఈ వేడుకల్లో తెలంగాణ పోలీసుల ధైర్యసాహసాలను చాటిచెప్పేలా పలు ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ జాగిలాల ప్రదర్శన ప్రజా ప్రతినిధులు, అధికారులను ఆకట్టుకుంది.

# రాష్ట్రానికి 7 నవోదయ విద్యాలయాలు




- కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

తెలంగాణలో కొత్తగా 7 నవోదయ పాఠశాలలు ఏర్పాటుచేయాలని కేం ద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 9 జవహర్ నవోదయ పాఠశాలలు ఉండగా, కొత్తవాటితో కలిపితే వాటి సంఖ్య 16కు చేరనున్నది. జగిత్యాల, నిజామాబాద్, భద్రాద్రికొత్తగూడెం, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, సూర్యాపేట జిల్లాల్లో కొత్త స్కూళ్లను ఏర్పాటుచేయనున్నారు.

కేంద్ర క్యాబినెట్ నిర్ణయం మేరకు దేశవ్యాప్తంగా కొత్తగా 85 కేంద్రీయ విద్యాలయాలు, 28 నవోదయ పాఠశాలలు ఏర్పాటుచేయనున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1256 కేవీలు ఉండగా, కొత్తవి 85 కలిపి వాటి సంఖ్య 1341కి చేరనున్నది. ఇక నవోదయ పాఠశాలలు ఇప్పటికే 661 ఉండగా కొత్తవి 28 కలిపితే మొత్తం 689 కానున్నాయి.

రాష్ట్రానికి కొత్తగా నాలుగు డైట్ కాలేజీలు మంజూరైనట్టు ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్ వెల్లడించారు. రాష్ట్రంలోని ఏడు జోన్లలో ఇప్పటికే 10 డైట్ కాలేజీలు ఉండగా, మరో నాలుగు ఏర్పాటు చేయనున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని కాళేశ్వరం జోన్లలో నెలకొల్పనున్నట్టు పేర్కొన్నారు.

2025-26 నుంచి ఎనిమిది సంవత్సరాల కాలంలో కొత్త కేంద్రీయ విద్యాలయాల నిర్మాణానికి, అదే విధంగా కర్ణాటకలోని శివమొగ్గలోని కేంద్రీయ విద్యాలయాన్ని విస్తరించేందుకు అంచనా వ్యయం 5 వేల 872.08 కోట్లు రూపాయలుగా నిర్ణయించారు. మాస్కో, కార్‌మాండూ, టెహ్రాన్‌తో పాటు దేశ వ్యాప్తంగా ఒక వెయ్యి 256 కేంద్రీయ విద్యాలయాలు ఉండగా, ఈ స్కూళ్లలో 13.56 లక్షల మంది విద్యార్థులు విద్యని అభ్యసిస్తున్నారు.

దిల్లీ మెట్రో నాలుగో దశ ప్రాజెక్టు కింద 26.463 కిలో మీటర్ల మేర రిథాలా-కుండలి కారిడార్ అభివృద్ధికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దిల్లీ- హరియాణా మధ్య కనెక్టివిటీని మెరుగుపరిచేందుకు 6 వేల 230 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టబోయే ఈ కారిడార్‌ను నాలుగేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## కొత్త టూరిజం పాలసీపై సమీక్ష



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ కొత్త టూరిజం పాలసీని డిసెంబర్ 31లోగా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి దుబాయ్, సింగపూర్, చైనా వంటి దేశాలు అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు.పర్యాటక విధానం రూపొందించే అంశంపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. పర్యాటక రంగం అభివృద్ధికి రాష్ట్రంలో మంచి అవకాశాలు ఉన్నప్పటికీ గత పదేళ్లలో ప్రత్యేకమైన పాలసీ లేకపోవడం వల్ల నష్టపోయాం. హైదరాబాద్ వాతావరణం 365 రోజులు బాగుంటుంది కాబట్టి అత్యుత్తమైన పాలసీని తయారు చేయాలని చెప్పారు.పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అవకాశం, ఆస్కారం ఉన్న ప్రాంతాల గురించి సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా పర్యాటక అభివృద్ధి సంస్థ రూపొందించిన పర్యాటక ప్రాంతాలపై రూపొందించిన షార్ట్ ఫిలిమ్ ను ఆవిష్కరించారు.

టైగర్ రిజర్వు ఫారెస్ట్ లను దేవాలయాలతో కనెక్ట్ చేయడం, రిజర్వు ఫారెస్ట్ ప్రాంతాల్లో పర్యాటకులు పెరిగేలా చూడాలన్నారు. ఉచిత బస్సు సౌకర్యం వల్ల టెంపుల్ టూరిజం గణనీయంగా పెరిగిందని, రొటీన్ టూరిజం కాకుండా కాన్సెప్ట్ టూరిజంపై దృష్టి సారించడం వంటి పలు అంశాలను సీఎం సూచించారు.పర్యాటకులను ఆకర్షించడానికి ఫ్యూచర్ సిటీలో మెగా కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయడంపై అధ్యయనం చేయాలన్నారు. విమానాశ్రయం నుంచి 20 నిమిషాల్లో చేరుకునేలా కన్వెన్షన్ సెంటర్ ఉండాలని అన్నారు. రాష్ట్రంలో పర్యాటక శాఖ స్థలాల లీజులపైన ఆరా తీసిన ముఖ్యమంత్రి వాటిపై సమగ్ర నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. లీజు ముగిసినా ఖాళీ చేయని వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇకనుంచి మంచి గుర్తింపు ఉన్న కంపెనీలకు మాత్రమే పర్యాటక స్థలాలను లీజుకు ఇవ్వాలని సూచించారు. ఖాళీ చేయబోయే ఉస్మానియా ఆసుపత్రి హెరిటేజ్ భవనాన్ని మంచి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. చార్మినార్ కు పర్యాటకులు పెరిగేలా అక్కడ పరిస్థితులు కల్పించాలని.. సొంత కాళ్లపై నిలబడేలా టూరిజం శాఖ కసరత్తు చేయాలన్నారు. ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, టూరిజం శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి, టూరిజం ఎండీ ప్రకాష్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లి విగ్రహ నమూనా బహిర్గతం!



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఈనెల 9న సచివాలయం ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్న తెలంగాణ తల్లి విగ్రహనమూనా బహిర్గతమైంది. బంగారు అంచుతో కూడిన పచ్చటి చీర, ఎరుపు రంగు జాకెట్ నుదుటన తిలకం తో తెలంగాణ తల్లి రూపు దిద్దుకుంది. చేతిలో మొక్కజొన్న వరి సజ్జలున్నాయి. విగ్రహం కింద గద్దెపై బిగించిన పిడికిలిని చిత్రీకరించారు.

రూ.5.30 కోట్ల వ్యయంతో తెలంగాణ తల్లి విగ్రహం జవహర్‌లాల్ నెహ్రూ ఫైనాన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ గంగాధర్ ఆ చిత్రానికి రూపకల్పన చేశారు. ప్రముఖ శిల్పి రమణారెడ్డి బృందం కాంస్యవిగ్రహాన్ని తయారుచేసింది. 17 అడుగుల కాంస్య విగ్రహాన్ని సిద్ధం చేసింది. విగ్రహాన్ని ఇప్పటికే సచివాలయం ప్రాంగణానికి తరలించారు. విగ్రహం ఎత్తు 17 అడుగులు కాగా కిందిగద్దె మరో మూడు అడుగులతో రూపొందించారు. సుమారు ఐదున్నర కోట్ల రూపాయలతో తెలంగాణ తల్లి విగ్రహం, పరిసరాల్లో ఫౌంటెన్ పచ్చిక బయళ్లను తీర్చిదిద్దారు.

## అంబేద్కర్ ఓపెన్ వర్శిటీ వీసీగా ఘంటా చక్రపాణి




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్‌గా ప్రొ ఫెసర్ ఘంటా చక్రపాణి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్. శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఘంటా చక్రపాణి శుక్రవారం సాయంత్రం అంబేద్కర్ వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రొ.చక్రపాణి అంబేద్కర్ విశ్వవిద్యలయం సోషియాలజీ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా, వివిధ పరిపాలనా పదవుల్లో సేవలు అందించి సీనియర్ ప్రొఫెసర్ హోదాల్లో పదవీ విరమణ చేశారు. అంతకుముందు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్‌గా ఘంటా చక్రపాణి సేవలు అందించారు.

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ(జెఎన్‌టియుహెచ్) ఇంఛార్జ్ వైస్ ఛాన్స్‌లర్‌గా ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

## వడ్డీ రేట్లు యథాతథం

- రైతులకు రుణ పరిమితి పెంపు
- తగ్గనునన్న జీడీపీ
- పెరగనున్న ద్రవ్యోల్బణం



**బలగం టీవీ, ముంబై బ్యూరో**

కీలక వడ్డీ రేట్లను వరుసగా 11వ సారి యథాతథంగా కొనసాగించాలని ఆర్‌బిఐ నిర్ణయించింది. అయితే బ్యాంకుల్లో నగదు లభ్యత సమస్యలను పరిష్కరించాలని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. ఇందుకోసం నగదు నిల్వల నిష్పత్తి (సిఆర్‌ఆర్)ను 4.5 శాతం నుంచి 4 శాతానికి తగ్గించామన్నారు. దీంతో బ్యాంకులు మరిన్ని రుణాలు మంజూరు చేసేందుకు వీలుంటుందన్నారు. ఈ నిర్ణయంతో బ్యాంకింగ్‌లోకి అదనంగా రూ.1.16 లక్షల కోట్ల నిధులు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఖాతాదారుల డిపాజిట్లలో కొంత సొమ్మును ఆర్‌బిఐ వద్ద జమ చేయడమే సిఆర్‌ఆర్. దీంతో డిపాజిట్‌దారుల సొమ్ముకు రక్షణ కల్పించాలనేది దీని ప్రధాన ఉద్దేశ్యం. అదే విధంగా ఇకపై చిను బ్యాంకులు కూడా యుపిఐ ద్వారా క్రెడిట్ లైన్‌ను ఆఫర్ చేసేందుకు అనుమతి కల్పించినట్లు శక్తికాంత తెలిపారు.

మరోవైపు రైతులకు రుణ పరిమితిని పెంచి.. వ్యవసాయ రంగానికి కొంత ఉపవశమనం కలిగించింది. డిసెంబరు 4 నుంచి మూడు రోజుల పాటు జరిగిన ద్రవ్య పరపతి విధాన సమీక్షా (ఎంపిసి) భేటీ నిర్ణయాలను శుక్రవారం ఆర్‌బిఐ గవరుర్ శక్తికాంత దాస్ మీడియాకు వెల్లడించారు. చిను, సనుకారు రైతులకు తనఖా రహిత వ్యవసాయ రుణాల పరిమితిని రూ.2 లక్షలకు పెంచుతున్నామన్నారు. ప్రస్తుతం ఈ పరిమితి రూ.1.6 లక్షలుగా ఉంది. పెంచిన రుణ పరిమితిని రైతులు ఎలాంటి తనఖా లేకుండా బ్యాంక్‌ల నుంచి పొందవచ్చన్నారు. పెట్టుబడి ఖర్చులు, ద్రవ్యోల్బణం, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని రుణ పరిమితిని పెంచామని శక్తికాంత తెలిపారు. ఇంతక్రితం 2019లో ఈ పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ.1.6 లక్షలకు పెంచుతూ ఆర్‌బిఐ నిర్ణయం తీసుకుంది.

వరుసగా 11వ సారి రెపో రేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు శక్తికాంత వెల్లడించారు. 2023 ఫిబ్రవరి నుంచి ఈ వడ్డీ రేటు మారలేదు. ద్రవ్యోల్బణం, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకొనిఈసారి కూడా మార్పులు చేయొద్దనినిర్ణయించామన్నారు. 2024-25లో వాస్తవ జిడిపి వృద్ధి రేటు 6.6శాతంగా ఉండొచ్చని అంచనా వేశారు. గత సమీక్షాలో ఈ అంచనా 7.2 శాతంగా ఉంది. జులై-సెప్టెంబరు త్రైమాసికంలో వృద్ధి రేటు అంచనాల కంటే భారీగా తగ్గి 5.4 శాతంగా నమోదయ్యింది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 202425కుగాను జిడిపి అంచనాలకు భారీగా కోత పెట్టింది. ఇంతక్రితం 202324లో ఏకంగా 8.2 శాతం వృద్ధి చోటు చేసుకుంది. దీంతో పోల్చితే భారీగా తగ్గనుందనిస్పష్టమవుతోంది. 2024 25లో రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను ఆర్‌బిఐ పెంచింది. గతంలో దీన్ని 4.5శాతంగా పేర్కొనగా.. తాజాగా 4.8శాతానికి పెరగొచ్చనివిశ్లేషించింది. ఆహార పదార్థాల ధరల పెరుగుదలతో ద్రవ్యోల్బణం అంచనాలను పెంచాల్సి వచ్చిందనిశక్తికాంత తెలిపారు. బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు బలంగా కొనసాగుతున్నాయన్నారు. రూపాయి విలువను బలోపేతం చేసేందుకు ఎన్‌ఆర్ఐ డిపాజిట్లపై వడ్డీరేటు పరిమితిని పెంచుతున్నామన్నారు.

అన్యాయంగా అమాయకుల సొమ్మును కొల్లగొడుతోను సైబర్ నేరగాళ్ల పనిపట్టాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) భావించింది. అక్రమంగా కొట్టేసిన సొమ్మును నకిలీ ఖాతాలకు మళ్లించి ఆపై అవసరాలకువాడుకుంటును 'మ్యూల్ ఎకౌంట్స్' పనిపట్టాలని బ్యాంక్‌లకు ఆర్‌బిఐ సూచించింది.

## గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదు..

- తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఈ గ్రూప్ 1 నోటిఫికేషన్ రద్దు, మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. వివరాల్లోకెళ్తే.. గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన కొత్త నోటిఫికేషన్ చట్టవిరుద్ధమని కొందరు అభ్యర్థులు గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అలాగే.. ప్రిలిమ్స్‌లో 14 తప్పులున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. గ్రూప్-1 మెయిన్స్ వాయిదా వేయాలని హైకోర్టును కోరారు. అయితే.. అప్పుడు అభ్యర్థుల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్‌చేస్తూ వాళ్లు సుప్రీంకోర్టుకు వెళ్లారు. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం (డిసెంబర్ 6) తీర్పు వెలువరించింది.

పిటిషనర్లు మెయిన్స్‌కు క్వాలిఫై కానందున మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాల్సిన అవసరం లేదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి గ్రీన్ సిగ్నల్ వచ్చేసినట్లయ్యింది. ఇప్పటికే టీజీపీఎస్సీ (%u+ూాజ%) గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు అక్టోబరు 21 నుంచి 27 వరకూ నిర్వహించిన విషయం తెలిసిందే. ఫిబ్రవరిలోగా మెయిన్స్ ఫలితాలు కూడా విడుదల చేయనున్నారు.

## హైడ్రా కూల్చివేతలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆల్వాల్ లో స్థానికంగా ఉండే ప్రజలు ఒక ఫంక్షన్ హాలు అక్రమ నిర్మాణంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు ఇటీవలె కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ప్రాంతాన్ని హైడ్రా సిబ్బంది పరిశీలించారు.. ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్కడ ఫంక్షన్ హాలు కట్టారని నిర్ధారించారు.. శుక్రవారం ఉదయం అక్కడకు బుల్ డోజర్తో వెళ్లిన హైడ్రా సిబ్బంది ఆ ఫంక్షన్ హాలును కూల్చివేశారు.. ఆ స్థలాన్ని స్వాధీనం చసుకుని అక్కడ ఇది ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పెట్టారు. అలాగే మేడ్చల్ జిల్లాలోని జవహర్ నగర్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను జేసీబీలతో కూల్చివేసింది. కొన్ని ప్రభుత్వ స్థలాలు, చెరువు భూముల్లో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని హైడ్రా అధికారులకు ఫిర్యాదులు రావడంతో శుక్రవారం ఉదయం కూల్చివేత చర్యలు కొనసాగాయి. అక్రమంగా ఖాళీ స్థలంలో నిర్మించిన హద్దు గోడలను జేసీబీ సాయంతో కూల్చివేశారు. ఇదిలాఉండగా, నగరంలో ఎక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టిన తమకు ఫిర్యాదు చేస్తే దాన్నిపరిశీలించాక చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇటీవల ప్రకటించారు.

ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

## జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు మహా కుంభ మేళా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మహాకుంభ్ 2025ని భారత సాంస్కృతిక ఐక్యతకు ప్రపంచ చిహ్నంగా మార్చాలని యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అనుకుంటోంది. ఇందులో భాగంగా ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య సారథ్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం భారీ రోడ్‌షో జరిగింది. రోడ్‌షో అనంతరం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శంగా నిలిచే ఓ అద్భుతమైన వేడుకగా మహాకుంభ్‌ను అభివర్ణించారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్- 2025లో పాల్గొనాలని తెలంగాణ ప్రజలను ఆహ్వానించారు. అంతర్జాతీయ భాగస్వామ్యం, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఈ కార్యక్రమం చారిత్రాత్మకంగా నిలిచిపోయేందుకు ప్రభుత్వం గణనీయమైన చర్యలు చేపడుతోం దని తెలిపారు. మహాకుంభ్ భారతదేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక స్ఫూర్తిని కలిగి ఉందన్నారు. ప్రయాగ్ రాజ్ మహాకుంభ్- 2025కు 45 కోట్ల మందికి పైగా యాత్రికులు, సాధువులు, సన్యాసులు, పర్యాటకులను ఆహ్వానించే అవకాశం ఉందని, ఇందుకోసమని సన్నాహక ఏర్పాట్లను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సకాలంలో పూర్తి చేసింన్నారు. జనవరి 13 నుండి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగ్‌రాజ్‌లో గంగా, యమున, సరస్వతి నదుల సంగమం పవిత్ర ఒడ్డున మహాకుంభ్ జరుగుతుందని, మానవాళికి అసంపూర్ణ సాంస్కృతిక వారసత్వంగా యునెస్కో గుర్తించిన మహాకుంభ్ 12 సంవత్సరాల విరామం తర్వాత మరోసారి పవిత్ర భూమి ప్రయాగలో జరుగుతోందని తెలిపారు.

## అంబేద్కర్ మార్గంలో నడుస్తున్న ప్రభుత్వం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

విద్య ద్వారానే అన్ని సమస్యలకూ పరిష్కారం లభిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. జేఎన్టీయూహెచ్‌లో శుక్రవారం నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పాల్గొని మాట్లాడారు. "అంబేద్కర్ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారు. దేశంలో అద్భుతమైన మానవ వనరులు ఉన్నాయి అవి జాతుల పోరాటంలో వృధా అవుతున్నాయి. అది లేకుంటే భారతదేశం ఇప్పటికే ప్రపంచంలో నెంబర్ వన్ స్థానానికి చేరుకునేది విద్య ద్వారా మాత్రమే సమస్యల పరిష్కారానికి మార్గం ఏర్పడుతుందని భావించి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున విద్యారంగంలో ఖర్చు చేస్తుంది సమగ్ర కుటుంబ సర్వే 99 శాతం పూర్తయింది త్వరలో ప్రజల ముందు పెడతాం ఆధునిక భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ శ్రమించడమే



అంబేద్కర్ కు ఘన నివాళి. అంబేద్కర్ కేవలం దళితులు ,గిరిజనలు, అణగారిన వర్గాల కోసమే పని చేశారని చిత్రించడానికి చాలామంది ప్రయత్నం చేస్తున్నారు అది సరైనది కాదు అన్నారు.

మహిళలకు మెటర్నిటీ లీవ్, మైనింగ్ లేబర్ యాక్ట్ ఇవన్నీ ఒక వర్గానికి సంబంధించిన హక్కులు కాదు అన్నారు. 8 గంటల పని విధానాన్ని అమల్లోకి తెచ్చిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కు మేడే సందర్భంగా అందరూ దండ వేయాలని అన్నారు. అంబేద్కర్ మనదేశంలో పుట్టడం మనందరి అదృష్టం అన్నారు.

# వైద్య వృత్తి ద్వారా పేదలకు సేవ చేయాలి..



● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, సిరిసిల్ల**

రాబోవు రోజుల్లో ప్రజా ఆరోగ్యం మీ చేతుల్లో ఉందని,వైద్య వృత్తి ద్వారా పేదలకు సేవ చేయాలి అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీలో నిర్వహించిన వైట్ కోట్ క్రిమోనీ వేడుకలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్య విద్యార్థి జీవితంలో ఈరోజు ప్రత్యేకమైన రోజు అని,ఎన్నో ఏళ్లుగా వైద్య వృత్తిని చేపట్టాలని కలలు కన్నారని, నేడు వైట్



క్రిమోని వేడుకలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. తల్లిదండ్రులు మీ పైన పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముందుకు పోవాలి అని, విద్యార్థి జీవితం మల్లి రాదు అని,కష్టం అయిన ఇష్టపడి చదువుతూ ముందుకు పోవాలిఅని అన్నారు.తోటి విద్యార్థుల కేరింతలు నడుమ నేడు వారు వైట్ కోట్ అందుకోవడం గర్వించదగ్గ విషయం అని,వైద్య వృత్తి ద్వారా పేదలకు ఎంతో సేవ చేయాలని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యను ప్రోత్సాహం అందించేందుకు ఇటీవల నూతనంగా కాలేజ్ లను ప్రారంభించడం జరిగింది అని,ప్రజారోగ్యం రాబోవు రోజుల్లో మీ చేతుల్లో ఉండనుంది అని అన్నారు. గొప్పగా పనిచేస్తూ, వైద్య వృత్తికే ఒక పేరు తెచ్చే విధంగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలిఅని, రానున్న కాలంలో మీ స్థాయిలో పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందించాలని అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 16 నూతన నర్సింగ్ కళాశాలను ప్రారంభించడం జరిగింది అని,240 పైచిలుకు అంబులెన్స్ ప్రజా ఆరోగ్యం కోసం అందుబాటులోకి తేవడం జరిగింది అని అన్నారు.

# హెూంగార్డుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటాం..



● పోలీసుశాఖలో హెూంగార్డుల సేవలు కీలకం..

● ఎస్పీ అఖిల్ మహాజన్..

**బలగం టీవీ, సిరిసిల్ల**

పోలీసు శాఖలో హెూంగార్డుల సేవలు కీలకమని, వారి సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో 62 వ హెూంగార్డు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు .ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరయ్యారు. ముందుగా సాయుధ హెూంగార్డు ప్లాటూన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం కవాతు పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఒక భాగమై పోలీసులతో సమానంగా నిరంతరం విధులు నిర్వర్తిస్తూన్నా హెూంగార్డు ఆఫీసర్స్ అందిస్తున్న సేవలు అమోఘమని అన్నారు.సాధారణ విధులు మొదలు క్లిష్టతర విధుల వరకు అన్నింటా చక్కగా పనిచేస్తూ హెూంగార్డు వ్యవస్థ పోలీస్ శాఖలో కీలకంగా మారిందని అన్నారు. శాంతిభద్రతలు, ప్రజలకు రక్షణ కల్పించడంతో బాధ్యతయుతమైన సేవలు అందించడంతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ , తమిళనాడు రాష్ట్రాలలో ఎన్నికల బందోబస్తులో అప్పగించిన భాధ్యతలు నిబద్ధతతో నిర్వహించారని అన్నారు.నిత్యం క్రమ శిక్షణతో మెలుగుతూ పోలీసుల ప్రతిష్టను మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని అన్నారు .

హెూంగార్డుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, హెూంగార్డుల సంక్షేమాన్ని, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగిందని, రాయితీతో కూడిన హెల్త్ కార్డ్స్ ఇవ్వడం జరిగిందన్నారు. హెూంగార్డ్స్ వారి యొక్క కుటుంబాలపై దృష్టి సారించి తమ యొక్క పిల్లలను ఉన్నత చదువులు చదివించి ఉన్నత స్థాయిలో ఆఫీసర్లుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రమేష్ , మధుకర్, పోలీస్ సిబ్బంది, హెూమ్ గార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చెయాలి : ఎస్పీ అఖిల్ మహాజన్

ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని,విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారిస్తు విలేజ్ పోలీస్ అధికారులు విధిగా గ్రామాల్లో పర్యటించలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.శుక్రవారం వార్షిక తనిఖీ లో భాగంగా ముస్తాబద్ పోలీస్ స్టేషన్ ను ఎస్పీ అఖిల్ మహాజన్ తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలు,5 ఎస్ అమలు తీరు రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్ని విభాగాల ను క్షుణ్ణంగా పరిశీలించారు.పెండింగ్లో ఉన్న కేసులపై రివ్యూ చేసి,పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి పలు సూచనలు చేసి పోలీస్ స్టేషన్ల పరిధిలోని కేసుల నమోదు,శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన వివరాలని అడిగి తెలుసుకున్నారు.


ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించే విధంగా విధులు నిర్వర్థించాలని,పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి చూపుతూ విలేజ్ పోలీస్ అధికారులు గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. పాత నేరస్థులపై నిఘా ఉంచలని,నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు గంజాయి వలన కలుగు అనర్థాలు,మహిళ చట్టాలు, సైబర్ నేరాలు, మొదలగు వాటిపై అవగాహన కల్పించాలన్నారు.

పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు, వ్యాలరస్థులకు సీసీ కెమెరాల ఉపయోగం, నేర నియాత్రణలో సీసీ కెమెరాల ప్రముఖ్యాత గురించి అవగాహన కల్పిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని అన్నారు అనంతరం స్టేషన్ పరిధిలోని వృద్ధులకు, మహిళలకు దుప్పట్లు,మరియు యువతకు స్పోర్ట్స్ టిషార్ట్స్ ను పంపిణీ చేశారు. ఇక్కడ డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ మొగిలి, ఎస్ఐ గణేష్, సిబ్బంది ఉన్నారు.





# చొప్పదండి ఎమ్మెల్యేను కలిసిన అనిల్ కుమార్



**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన ఏనుగుల అనిల్ కుమార్ మండల యువజన కాంగ్రెస్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యమును మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ కు శాల్వ కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో ద్యావనపల్లి రాజశేఖర్, సువీన్ యాదవ్, మంద వెంకటేష్, శ్రీనివాస్ పటేల్,రాజేష్ తదితరులు ఉన్నారు.

# సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లా అధ్యక్షునిగా రెడ్డి రవి

**బలగం టీవీ, సిరిసిల్ల**



సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ నూతన అధ్యక్షుడిగా రెడ్డి రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఈ ఎన్నుకున్నారు.అధ్యక్షులు రెడ్డి రవి ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, జి. రాజలింగం కార్యదర్శి షీలా కుమార్ కోశాధికారి శంకర్,సోషల్ మీడియా కన్వీనర్ ఆనంద్ లుగా ఎన్నుకున్నారు.ఎన్నికల అధికారిగా బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోతీలాల్ వ్యవహరించారు నూతన కార్యవర్గానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు...ఫోరం ఐక్యతకు, సబ్జెక్ట అభివృద్ధికి జిల్లా కార్యవర్గం కృషి చేయాలని ఆయన సూచించారు. తమ ఏకగ్రీవ ఎన్నిక కు సహకరించిన జిల్లాలోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులందరికీ అధ్యక్షులు రెడ్డి రవి, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఫోరం అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తామని, ఫోరం తరపున చేపట్టే ప్రతి కార్యక్రమంలో బాధ్యతగా పనిచేస్తామని వారు తెలిపారు.

# బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి



**బలగం టీవీ ,తంగళ్ళపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని జిల్లెళ్ళ గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లా మధు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబాసాహెబ్ అని తాను చేసిన కృషి వల్లే భారత రాజ్యాంగం మనకు అమలులోకి వచ్చిందని నేడు రాజ్యాంగం ద్వారా ఎన్నో హక్కులు సాధించుకున్నామని ప్రస్తుతం మనం సాధించుకున్న తెలంగాణ కూడా ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని పొందామన్నారు. ప్రజల కోసం నిరంతరం కృషిచేసిన మహానీయుడని తాను రాజ్యాంగం అందిస్తున్న సందర్భంలో ఎన్నోసార్లు బాబాసాహెబ్ పై కుట్రలకు పూనుకున్నారన్నారు.తన కృషి ద్వారా రాజ్యాంగాన్ని అందించిన గొప్పమహానీయుడని స్మరించుకున్నారు.

## ఆయన సేవలు మహెూన్నతమైనవి : న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్


**బలగం టీవీ , బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో అంబేద్క చిత్రపటానికి ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ: భారతదేశానికి ఎంతో గాను సేవలు చేసిన మహనీయుడని, భారత రాజ్యాంగాన్ని రచించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. దేశం గర్వించదగ్గ వ్యక్తి అంబేద్కర్ అని, వారిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో విద్యార్థినీ, విద్యార్థులు, యువత ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆయన వెంట ఉన్నారు.

## 'బీఆర్ఎస్ నియంత పోకడను ప్రజలు తుంగలో తొక్కారు'

**బలగం టీవీ , తంగళ్లపల్లి**




తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మేము గతంలో ప్రజల పక్షాన పోరాటం చేసి ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల కోసం పనిచేశామని అందుకే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వనికి అధికారం అప్పజెప్పారన్నారు. గతంలో బిఆర్ఎస్ నాయకులు దోపిడి రాజకీయాలు చేస్తూ భూకబ్జాలు, అక్రమ వెంచర్లు ప్రతి పథకంలో కమిషన్లతో పాలన కొనసాగిస్తూ పేద ప్రజలను హరిగోస పెట్టారన్నారు. ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని మండేపల్లి లోని కేసీఆర్ నగర్ లో అర్హులకు డబుల్ బెడ్ రూములు అందకపోగా గుర్తించిన వారి దగ్గర నుండి లక్షల రూపాయల్లో వసూళ్లు చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరళ్ల నరసింగం గౌడ్,గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్,బైరినేని రాము, బండి పర్శరాములు, లింగాల భూపతి,రాజు,మీరాల శ్రీనివాస్ యాదవ్,అరపెల్లి బాలు,విజయ్,మునిగేల రాజు, గుగ్గిళ్ల భరత్,ఏగుర్ల ప్రశాంత్, పయ్యావుల శ్రీనివాస్ తదితరులున్నారు.



# చెరువు కట్ట భూముల కబ్జా...

- న్యాయం చేయాలని రైతుల డిమాండ్

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని దేశాయి పల్లె గ్రామంలో పనికి ఆహార పథకంలో భాగంగా 1992లో చెరువును గ్రామస్తుల సహకారంతో నిర్మించుకున్నారు. ఇట్టి చెరువు కట్టను అనుకొని సుమారు 30 గుంటల వరకు సంకినేని గోపాలరావు, సంకినేని కరుణాకర్ రావు ఇరువురు కబ్జా చేస్తున్నారని గ్రామస్తులు,రైతులు ఆరోపించారు.గతంలో నుండి ప్రతి సంవత్సరం ఏటా బతుకమ్మ పండుగ వచ్చినప్పుడు గ్రామస్తుల సహకారంతో మొరం పోసి తోవ్వను నిర్మించుకున్నామని ఆ తోవ్వనుండే దుర్గమ్మ గుడికి,కొండ పోచమ్మ గుడికి నిత్యం భక్తులు దర్శనానికి వెళ్తారని తెలిపారు. నిర్మించుకున్న ఈ చెరువు ప్రాంతంలో రెండు బోర్లు వేసుకొని గ్రామస్తుల తాగునీటి సదుపాయం కూడా ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఇదే కట్టను అనుకొని రైతుల బర్లు, గొర్లు మెపు కోవడానికి నిత్యం వెళ్తామని ఈ కట్టను అనుకుని త్రోవ్వ ద్వారా కింది పొలాలకు రైతులు నిత్యం వెళుతుంటామని ప్రస్తుతం తూమును అనుకోని క్రింది ప్రాంతం అంతా పొలాలుగా మార్చడంతో ఇరిగేషన్ నియమ నిబంధనలు తుంగలో తొక్కారని అటు రైతులకు ఇటు భక్తులకు ఇబ్బందిగా మారిందని వాపోయారు.గతంలో లాగా దొరల పెత్తానంతో అగడాలు చెలాయిస్తూన్నారని కోన్ని సంవత్సరాల నుండి గ్రామస్తులు వాడుకుంటున్న త్రోవ్వను కబ్జా చేయడం దారుణం అన్నారు.మొఖ మీదికి పోలీసులు వచ్చి చూసి వెళ్లిన ఇప్పటివరకు తమకు న్యాయం జరగలేదని ఎమ్మార్వో కు వినతి పత్రం ఇచ్చిన ఇరిగేషన్ అధికారులు కూడా స్పందించడం లేదని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి కబ్జాకు గురవుతున్న చెరువు కట్టను సంరక్షించి రైతులకు గ్రామస్తులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా తుమ్మల కొమురయ్య,తుమ్మల ఎల్లయ్య,పోచయ్య, తుమ్మల మల్లేశం,సతీష్ లు మాజీ సర్పంచ్ గ్రామస్తులు రైతులు కోరారు.



# డాక్టరేట్ పట్టా అందుకున్న పెద్దింటి..



**బలగం టీవీ, సిరిసిల్ల :**

ప్రముఖ కథా రచయిత పెద్దింటి అశోక్ కుమార్ ‘ తెలంగాణ వలస కథలు వస్తు శిల్ప వైవిధ్యం’ అనే అంశం మీద పరిశోధన పూర్తి చేసినందుకుగాను ఉస్మానియా యూనివర్సిటీ శుక్రవారం డాక్టరేట్ ప్రకటించింది. పెద్దింటి అశోక్ కుమార్ రాసిన లాంగ్ మార్చ్, జిగిరి రెండు నవలలు ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో పీజీ మరియు డిగ్రీ విద్యార్థులకు సిలబస్ గా ఉన్నాయి. పెద్దింటి సాహిత్యం మీద వివిధ యూనివర్సిటీలలో నాలుగు పీహెచ్డీ, ఆరు ఎంఫిల్ పరిశోధనలు జరగగా,మరో మూడు పీహెచ్డీ పరిశోధనలు జరుగుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీం-రావుపేట మండలం మల్లారెడ్డిపేట లో జన్మించిన పెద్దింటి అశోక్ కుమార్, సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్ నగర్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నడు.పెద్దింటి 300కు పైగా కథలు,ఎనిమిది నవలలు, ఐదు నాటకాలతో పాటు సినిమాలకి కథలు మాటలు పాటలు రాస్తున్నారు. పెద్దింటి రాసిన జిగిరి నవల 12 భాషల్లోకి అనువాదం అయింది. ఆయన సాహిత్యం పై అనేక పీహెచ్డీలు ఎంఫిల్ పరిశోధనలు జరిగాక ఆయన డాక్టరేట్ పూర్తి చేయడం ఒక విశేషం.

# భార్యను వేదించిన భర్తకు ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానా

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో అదనపు కట్నం కోసం భార్యను వేదించిన భర్తకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2000 జరిమానా విధిస్తూ వేములవాడ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జ్యోతి శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.వివరాలలోకి వెళితే బోయినిపల్లి మండలం తడగొండ గ్రామానికి చెందిన మహేందర్ కు గంగాధర మండలం పిట్టలపల్లి గ్రామానికి చెందిన మమతతో 2011 సంవత్సరంలో వివాహం జరిగింది. కొన్నేళ్ల తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేదింపులకు గురిచేసేవాడు. 2017 సంవత్సరంలో బోయినిపల్లి పోలీస్ స్టేషన్ లో మహేందర్ పై భార్య ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యుషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ విక్రాంత్ వాదించగా సి.ఎం.ఎస్ ఎస్.ఐ. రవీందర్ నాయుడు,కానిస్టేబుల్ మధుసూదన్,రాజేంద్ర ప్రసాద్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టాగా కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి.. నేరం రుజువు కావడంతో మహేందర్ కి శిక్ష విధించినట్లు సి.ఐ తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పై ప్రచారం కల్పించాలి

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు వేగవంతంగా పరిష్కారం అయ్యేందుకు చర్యలు..
- కోర్టులలో ఆధారాలు సమర్పించి నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలి.
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసుల పై విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలని, పోలీస్ స్టేషన్ లలో తప్పనిసరిగా చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని,ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు వేగవంతంగా పరిష్కారం అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నియంత్రణ పై ఎస్పి అఖిల్ మహజన్ తో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝ జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ ట్రైబ్ శాఖల పరిధిలోని హాస్టల్స్, రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్షిప్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్, స్టడీ సర్కిల్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వంటి పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్ కు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

సిరిసిల్ల జిల్లాలో నవంబర్ 30 నాటికి పెండింగ్ ఉన్న మొత్తం 30 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదయ్యాయని, వీటిపై కేసుల వారిగా వారం రోజులలో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. 2016 నుంచి ఇప్పటివరకు సిరిసిల్ల జిల్లాలో మొత్తం 8 మర్డర్లు, 4 రేప్ కేసులు, 486 అట్రాసిటీ మొత్తం 498 ఎస్సీ , ఎస్టీ కేసుల ఫిర్యాదులు రాగా 5 కోట్ల 64 లక్షల 11 వేల 250 రూపాయల పరిహారం మంజూరు చేశామని, మరో కోటి రూపాయల 76 లక్షల 37 వేల 500 పరిహారం ఇచ్చేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించామని అన్నారు .

ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించి కోర్టులలో సంబంధిత నేరస్తులకు శిక్ష పడే విధంగా ఆధారాలను సమర్పించాలని, ఎస్సీ ఎస్టీలకు న్యాయం జరిగే విధంగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని అన్నారు . అనంతరం జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్న కలెక్టర్, వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ , వారు అందించిన సూచనలు పాటించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు వెంకట ఉపేందర్ రెడ్డి,రాజేశ్వర్, సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాములు, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయ లక్ష్మి, ఈడి ఎస్సి కార్పొరేషన్ స్వప్న, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కొమ్ము బాలయ్య, అజ్మీర తిరుపతి, మెట్ట దేవానంద్, కొత్తపల్లి సుధాకర్, పాసుల బాలరాజ్, ఎన్జీవో సభ్యులు ఆలువల ఈశ్వర్, డప్పుల అశోక్, సిరిగిరి రామచందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో ప్రతిభకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం





**ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్**

**బలగం టీవీ , వేములవాడ :**

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో దోహదపడుతాయని ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఇన్స్పైర్ మరియు విద్యా వైజ్ఞానిక ప్రదర్శను ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో 68 ఇన్స్పైర్ ప్రాజెక్టులు మరియు 400కు పైగా నమూనా ప్రదర్శనలు ప్రదర్శించారు.జిల్లావ్యాప్తంగా 13 మండలాల నుండి దాదాపు 800 లకు పైగా విద్యార్థిని విద్యార్థులు,250 మందికి పైగా టీచర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అత్యంత తెలివైన అద్భుతమైన ప్రాజెక్టులను తీసుకురావడం అభినందనీయం అన్నారు. గతంలో కూడా ఇలాంటి ప్రదర్శనల నుండే రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయస్థాయిలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు మంచి గుర్తింపు వచ్చిందని అన్నారు.అదే స్ఫూర్తితో ప్రస్తుతం పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు తమ ప్రదర్శనలను కూడా రాష్ట్ర మరియు జాతీయస్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. జిల్లా విద్యాశాఖ కోరిక మేరకు సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా విద్యాధికారి బి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ 400కు పైగా నమూనా ప్రాజెక్టులు తీసుకురావడం,ఇన్స్పైర్లో 68 ప్రాజెక్టులు తీసుకురావడంలో విద్యార్థుల కృషితో పాటు ఉపాధ్యాయుల ప్రోత్సాహం అభినందనీయమని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమిష్టి కృషితో మొదటి రోజు వచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మధ్యాహ్న భోజనంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించామని, శనివారం నాడు ప్రదర్శన కొనసాగుతుందని,ఆసక్తి గల విద్యార్థులు ఈ ప్రదర్శనను మధ్యాహ్నం లోపు వీక్షించవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో వేములవాడ మునిసిపాలిటీ వైస్ చైర్మన్ బింగి మహేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, డైరెక్టర్ దైత కుమార్, ఖమ్మం గణేష్, మాజీ కౌన్సిలర్ లు మరియు ప్రజా ప్రతినిధులు అన్నారం శ్రీనివాస్,పులి రాంబాబు, సాగరం వెంకటస్వామి, పుల్కం రాజు, కొక్కుల రాజు, అన్ని మండలాల విద్యాధికారులు, అన్ని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వర్ధంతి..

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**



భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పూల మాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటం, రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ సేవలను కొనియాడారు. ఆయన భారత మొట్ట మొదటి కేంద్ర లా అండ్ జస్టిస్ శాఖ మంత్రిగా సేవలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఉపేందర్ రెడ్డి, రాజేశ్వర్, డీఎస్ సీడీఓ విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తొలి రోజు కంగారులదే...

## భారీ స్కోరు దిశగా ఆస్ట్రేలియా.. భారత్ 180 ఆలౌట్




**బలగం టీవి, అడిలైడ్**

రెండో టెస్టు మొదటి రోజు ఆస్ట్రేలియా ఆధిపత్యం కొనసాగింది. ఇండియాను 180కి ఆలౌట్ చేసిన ఆసీస్.. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 86 రన్స్ చేసింది. ఆస్ట్రేలియా ఇంకా 96 రన్స్ వెనుకబడి ఉంది. ఆసీస్ బ్యాటర్లలో ఖాజా ఔటయ్యాడు. నాథన్ మెక్స్వీనే 38, లబుషేన్ 20 రన్స్‌తో క్రీజ్‌లో ఉన్నారు. ఈ ఇద్దరు బ్యాటర్లు భారత బౌలర్లను మెరుగ్గా ఎదుర్కొన్నారు.

అంతకుముందు టీమిండియా కేవలం 44.1 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌట్ అయ్యింది. నితీశ్ కుమార్ రెడ్డి (42, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్ గా నిలిచాడు. కేఎల్ రాహుల్ (37), శుబ్ మన్ గిల్ (31) రాణించారు. వీరు మినహా మిగిలిన వారు దారుణంగా విఫలం అయ్యారు. కోహ్లీ, రోహిత్ శర్మలు ఆస్ట్రేలియా పేసర్ల ధాటికి రెండంకెల స్కోరు కూడా దాటలేకపోయారు. కెప్టెన్ రోహిత్ శర్మ (3 పరుగులు), స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (7 పరుగులు) నిరాశ పర్చారు. యంగ్ బ్యాటర్ యశస్వీ జైస్వాల్ (0) పరుగుల ఖాకా తెరవకుండానే పెవిలియన్ చేరాడు.ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 6 వికెట్లతో మెరిశాడు. కమిన్స్, బొలాండ్ లకు చెరో రెండు వికెట్ల చొప్పున లభించాయి.




# ఆసియా కప్.. ఫైనల్‌కు భారత్

**బలగం టీవి, షార్జా**

అండర్-19 ఆసియా కప్‌లో భారత్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో 7 వికెట్ల తేడాతో శ్రీలంకపై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన లంక 46.2 ఓవర్లలో 173 పరుగులకే కుప్పకూలింది. లక్విన్ అభయసింఘే(69), షారుజన్ షణ్ముగనాథన్(42) మినహా అందరూ బ్యాటర్లు నిరాశపరిచారు. ఇన్నింగ్స్‌లో ఏడుగురు సింగిల్ డిజిట్‌కు పరిమితమయ్యారు. భారత బౌలర్లలో చేతన్‌శర్మ మూడు వికెట్లతో రాణించగా, కిరణ్ చోర్మలే, ఆయుశ్ మాత్రె రెండు వికెట్లతో లంకను నిలువరించారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన యువ భారత్ సూర్యవంశీ(36 బంతుల్లో 67, 6ఫోర్లు, 5సిక్సర్లు) ధనాధన్ అర్ధసెంచరీతో 21.4 ఓవర్లలో 175-3 స్కోరు చేసింది. ఓపెనర్ ఆయూశ్ మాత్రె(34)తో కలిసి తొలి వికెట్‌కు సూర్యవంశీ 91 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమైన సూర్యవంశీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఆదివారం జరిగే ఫైనల్లో బంగ్లాదేశ్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. మరో సెమీస్‌లో బంగ్లా 7 వికెట్ల తేడాతో పాక్‌ను ఓడించింది.

# హ్యారీ బ్రూక్ సూపర్ సెంచరీ..

**బలగం టీవి, హైదరాబాద్**

న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో అద్భుతమైన సెంచరీతో చెలరేగిన బ్రూక్.. ఇప్పుడు రెండో టెస్టులో కూడా సెంచరీ చేశాడు. క్రైస్ట్ చర్చ్ వేదికగా జరుగుతున్న సెకెండ్ టెస్టులోవన్డే తరహాలో తన ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బ్రూక్ కేవలం 91 పరుగుల్లోనే తన 8వ టెస్టు సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో 115 బంతులు ఎదుర్కొన్న బ్రూక్.. 11 ఫోర్లు, 5 సిక్స్‌లతో 123 పరుగులు చేసి రనౌటయ్యాడు. ఇక అతడి అద్భుత ప్రదర్శన ఫలితంగా ఇంగ్లండ్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 280 పరుగులకు ఆలౌటైంది.ఇంగ్లండ్ అతడితో పాటు ఓలీ పోప్(66) హాఫ్ సెంచరీతో రాణించాడు. కివీస్ బౌలర్లలో నాథన్ స్మిత్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. విలియం ఓ రూర్క్ 3, మాట్ హెన్రీ రెండు వికెట్లు సాధించారు.

అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన న్యూజిలాండ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 86 పరుగులు చేసింది. కివీస్ ప్రస్తుతం 194 పరుగుల వెనకంజలో ఉంది. ఇంగ్లండ్ బౌలర్లలో



బ్రైడన్ కార్సే రెండు వికెట్లు సాధించగా.. వోక్స్, అట్కిన్సన్, స్టోక్స్ తలా వికెట్ పడగొట్టారు.

## నేటి నుంచి సీఎం కప్

**బలగం టీవి, హైదరాబాద్**


రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సీఎం కప్ టోర్నీకి రంగం సిద్ధమైంది. శనివారం నుంచి గ్రామ స్థాయి పోటీలతో సీఎం కప్ పోటీలకు తెరలేవనుంది. మొత్తంగా 36 క్రీడాంశాలతో నాలుగు దశల్లో రాష్ట్ర వ్యాప్తంగా పోటీలను నిర్వహిస్తారు. రెండు రోజుల్లో దాదాపు 12వేల గ్రామాల్లో అథ్లెటిక్స్, వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, యోగాతో పాటు స్థానిక ఆటకు ప్రాధాన్యమివ్వనున్నారు. సీఎం కప్‌లో పోటీపడేందుకు శుక్రవారం సాయంత్రం వరకు లక్ష మంది ప్లేయర్లు ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారని సాట్స్ తెలిపింది.

## శ్రీశైలంలో నాగచైతన్య - శోభిత

**బలగం టీవి, హైదరాబాద్**

అక్కినేని నాగచైతన్య , శోభిత ధూళిపాళ్ల వివాహ బంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో వీరి వివాహ అంగరంగ వైభవంగా జరిగింది. తాజాగా నూతన జంట శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. అక్కినేని నాగార్జునతో కలిసి చైతూ-శోభిత జంట శుక్రవారం శ్రీశైలం వెళ్లారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వీరికి అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనం చేశారు.








## 'పుష్ప 2'కు తొలి రోజు కలెక్షన్స్ రికార్డు

**బలగం టీవి, హైదరాబాద్**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ - సుకుమార్ కాంబోలో తెరకెక్కిన 'పుష్ప 2' ఇండియన్ రికార్డు క్రియేట్ చేసింది. తొలి రోజు ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ.294 కోట్లు వసూలు చేసినట్లు మేకర్స్ అధికారికంగా తెలిపారు. ఈ క్రమంలో ఇప్పటివరకు డే 1 అత్యధిక వసూళ్లుగా ఉన్న ఆర్ఆర్ఆర్ (రూ. 224 కోట్లు) రికార్డ్ బ్రేక్ అయ్యింది. అలాగే పుష్ప బాలీవుడ్‌లోనూ అరుదైన రికార్డు నెలకొల్పింది.ఏకంగా తొలిరోజు రూ.72 కోట్లు నెట్ వసూల్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో బాలీవుడ్‌లో తొలి రోజు అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా పుష్ప రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ క్రమంలోనే షారుక్ ఖాన్ 'జవాన్' తొలి రోజు రికార్డు క్రాస్ చేసింది. జవాన్ తొలి రోజు రూ.65.5 కోట్ల కలెక్షన్లు సాధించగా, పుష్ప-2 రూ.72కోట్లు కొల్లగొట్టింది. అంటే ఏ స్థాయిలో పుష్ప రూలింగ్ కొనసాగుతోందో అర్థం చేసుకోవచ్చు.

## మృతురాలి కుటుంబానికి రూ. 25 లక్షలు



- **నటుడు అల్లు అర్జున్ ప్రకటన**
- **సంధ్య థియేటర్ ఘటనపై స్పందించిన నటుడు**

**బలగం టీవి, హైదరాబాద్**

'పుష్ప2' ప్రీమియర్ షో వేళ హైదరాబాద్ లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై ఆ సినిమా నటుడు, హీరో అల్లు అర్జున్‌స్పందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొంటూ సోషల్ మీడియా వేదికగా వీడియో విడుదల చేశారు. 'మేం 'పుష్ప 2' ప్రీమియర్ షోకి హైదరాబాద్ లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని సంధ్య థియేటర్‌కు వెళ్లాం. అక్కడ జరిగిన తొక్కిసలాటలో కొందరికి దెబ్బలు తగిలాయని తెలిసింది. ఇద్దరు పిల్లల తల్లి రేవతి గారు చనిపోయారని తెలియగానే మా చిత్ర బృందం అంతా షాక్ కు గురయ్యాం. థియేటర్ కి వెళ్లి అభిమానులతో కలిసి సినిమా చూడటమనేది గత 20 ఏండ్లు నాకు ఆనవాయితీగా వస్తున్నది. ప్రేక్షకులకు వినోదాన్నిచ్చే సినిమా థియేటర్ వద్ద అలా జరగడం బాధగా ఉంది. రేవతి గారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.. ఎంత చేసినా ఆమె లేని లోటు తీర్చలేనిది. నా తరపున రూ.25 లక్షలు సాయం చేయాలని నిర్ణయించుకున్నా' అని ఆయన తెలిపారు.